# ద్రోహి

అదో వింతగా కనిపించే ఆ యిల్లు అంత పెద్దదీ అనడానికి వీల్లేదు, అంతచిన్నదీ అనడానికి వీల్లేదు. కాని ఆ యింటిని చూసేసరికల్లా మాత్రం చెప్పలేని సంతోషం కలుగుతుంది. అసలా వాతావరణం అమృతమయం. ఆయిల్లు కళాకాంతులతో కలకలలాడుతుంది. యింట్లోంచి వెలువడేవి దివ్యద్యుతులు. అది మళ్లీ సాధారణ గృహమే. యింటివాళ్లు యిబ్బందిలేకుండా కాలక్షేపంచేస్తూన్న సంసారులే.

ఆ యింటిని మరోసారి చూసేసరికి మరోవింత. అమృతహస్తులు ఆ యింట్లో ఉండేవారట. ఆ పూర్వవాసన ఆ యింటినిండా నిండుకుంది. తత్ఫలితంగా యిప్పుడందులో నివసిస్తూన్న వాళ్లకి అది ప్రసాదించినది సులభసాధ్యం కాని కళాజీవితం. అంచేతే చూసేవాళ్లకి ఆనందం. కాని అంతలోనే గొప్ప విచారం కూడాను. ఈ శోభ, ఈ ఆనందం ఎంతవయస్సు గలవో! వాటివయస్సు తగ్గిపోతేనో!! ఆనందం దుఃఖంగా మారుతుంది, గుండె కరిగి నీరైపోతుంది, దేహం కరుడుగట్టిపోతుంది. చివరకి అంతరాత్మ ఈ అనంత విశ్వంలో లీనం అయిపోతుంది. ఈ ఆందోళన అనుభవించేకన్న ఆయిల్లు శాశ్వతంగా శోభించాలని కోరుకుంటేనే మంచిది.

ఆయింట్లో నివసించేవాళ్లు యిద్దరే. పాతికసంవత్సరాల వయస్సుగల శిల్పి, అతనితల్లి అరవై సంవత్సరాల వృద్ధు. ఆశిల్పి తాత తండ్రులు, పాతాళజలం మాదిరిగా తమలోంచి ఉద్భవించే అమృతాన్ని ఖర్చుచేసి ధనం సంపాదించారు. శిల్పి తండ్రి, తనజీవిత గ్రంథంలోని ఆఖరిపుటకూడా తిరిగి పోతూన్నప్పుడు శిల్పికి 'నాయనా! యిదుగో ఈ అమృతం తీసుకో. దీనిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి సుమీ—!' అన్నే ఒక్కమాటే చెప్పేడు.

తండ్రియిచ్చిన సందేశాన్ని శిరసావహించేడు శిల్పి. నిత్యం అతను చేసేపని కళారాధన. ప్రతిమలు నిర్మిస్తూండేవాడు. అందుకు సరిపోయేటంత ధనంకూడాఉంది అతనికి. ఎన్నెన్నో ప్రతిమలు తయారుచేసేడు. ఎందరో అతని కళానైపుణ్యానికాశ్చర్యపడ్డారు. శిల్పి బహు అదృష్టవంతుడు, సిద్ధహస్తుడు అని వేనోళ్ల కీర్తించారు.

మధ్యాహ్నం పన్నెండుగంటల వేళయింది. రోడ్డుమీదనుంచి ఒకకుర్రవాడు వెళ్లిపోతూ దృష్టి పక్కకి మళ్లించేడు. సజీవచంద్రకాంత శిలాప్రతిమ ఒకటి శిల్పికూర్చున్న గదికిటికీ ఊచల్లోంచి గోచరించింది. ప్రతిమముఖంతట్టు నిలింప నేత్రాలతో చూస్తూ కూర్చున్నాడు శిల్పి. చట్టున అరుగెక్కి గదిగుమ్మందగ్గిర నించున్నాడు. శిల్పి చలనంలేకుండా చూస్తున్నాడు. కొన్ని నిమిషాలు గడిచేయి. శిల్పి వెనక్కితిరిగి చూసేడు. ఆ అపరిచితుడిని కూర్చోమన్నాడు. సంభాషణ సందర్భంలో ఆ పరాయి అబ్బాయి ఒక దిక్కులేనిపక్షి అని తెలుసుకున్నాడు. శిల్పికి గుండె నీరైపోయింది.

శిల్పికి తల్లి మినహాయించి యింకెవరూ లేరు. కళత్రనష్టంనుంచి విరక్తిచెందిపోయాడు. తన ఉద్యమం ఉన్నంతకాలం చింతలేదు. కాని అతనికి ఒక్కటే విచారం. తన తరువాత ఆ ఆరాధనచేసే వారెవరు?

పరాయి అబ్బాయిని అభిమాన పూర్వకంగా పలకరించి 'తమ్ముడూ! నా దగ్గిరఉండి నీవుకూడా ఈ పవిత్రారాధన చెయ్యకూడదూ?' అన్నాడు. సరే అన్నట్టుగా తల ఊపేడు పరాయిఅబ్బాయి. శిల్పికి పరాయి అబ్బాయిఅంటే ఎంతో అభిమానం. అతనికి ఈ విద్య నేర్పడానికి ప్రయత్నించేడు. కాని లాభం లేక పోయింది. 'పోనీ తమ్ముడూ! నువ్వు యిక్కడే ఉండిపో' అని తనసోదరుడికి చెప్పినట్టు చెప్పేడు. యింక పరాయి అబ్బాయికి బెంగలేదు. పొట్టపోషణ ఎలాజరుగుతుందా అన్న విచారంలేదు. శిల్పి జీవించి

ఉన్నంతకాలం పరాయి అబ్బాయికి ఏలోటులేదు. సగంముగిసిన ఏ ప్రతిమచెంతనో శిల్పి రచనచేస్తూ కూర్చుంటే, నిస్సారమైన హృదయాన్ని బైటకుపంపి శిల్పి ప్రక్కనే కూర్చునేవాడు పరాయి అబ్బాయి. ఎన్నిరోజులో గడిచిపోయాయి.

శిల్పికి విచారం, పరాయి అబ్బాయికి సంతోషం. పరాయి అబ్బాయికి ఉద్యోగందొరికింది. విసుగుపుట్టించే ఈ కాలయాపన ఎప్పుడు పోతుందాఅని చూస్తున్నాడు పరాయిఅబ్బాయి. మూటముల్లే కట్టుకున్నాడు. పయనం అయేడు. శిల్పికి పట్టలేని విచారంకలిగింది. పరాయి అబ్బాయిని కౌగలించు కున్నాడు. పరాయి అబ్బాయి బండి ఎక్కేడు. 'అతని కదృష్టం లేనేలేదు-నాకు అదృష్టంలేదు' అని అంటూ అశ్రుపూరితలోచనాలతోచూస్తూ నిలబడిపోయాడు శిల్పి.

పరాయి అబ్బాయి వెళ్లిపోయాడు. శిల్పికి చాలా విచారం కలిగింది. కాని తన కాలక్షేపం తన విచారాన్ని కొంతవరకూ మట్టిపెట్టేది.

ఏ ప్రదర్శనశాలలో చూసినా శిల్పి విగ్రహాలే. శిల్పిని చూడని వాళ్లు అతనుచేసిన విగ్రహాలు చూసి ఎంతో మురిసిపోయేవారు.

పరాయి అబ్బాయి ఉద్యోగంలో ప్రవేశించేడు. అతను శిల్పిని సుమారుగా మర్చిపోయినా, శిల్పి మాత్రం పరాయి అబ్బాయిని మర్చిపోలేదు. ఆతనిమీద అభిమానం తగ్గలేదు. అతన్ని తల్చుకోని క్షణం

★ శ్రీ ఆగర వేంకట సత్యనారాయణరావు ★

లేదు. ఏకొత్తవిగ్రహం తయారు చేసినా, ఏప్రదర్శనంలో తన విగ్రహాలకి గెలుపొచ్చినా, తనసంతోషాన్ని, పరాయి అబ్బాయికి తెలియబరిచేవాడు.

పరాయి అబ్బాయికి యిరవైరూపాయల జీతం. అతనిఅధికారికూడా ఒకశిల్పి. కాని అధికారికి, 'శిల్పి' కి హస్తిమశకాంతరంతేడా. పరాయి అబ్బాయివల్ల శిల్పిభోగట్టా, అతని ప్రవీణత తెలుసుకున్నాడు అధికారి. పరాయి అబ్బాయి శిల్పిని అభిమానంలేని పొగడ్తలుచేసేవాడు అధికారిదగ్గర. ఆ కనీసంపొగడ్తకి కూడా విరుద్ధంగా ఉండేది అధికారి హృదయతత్త్వం. అది గ్రహించాడు పరాయి అబ్బాయి. శిల్పిని ఏవగించుకుంటే అధికారికి సంతోషం, మనస్సంతృప్తిని. ఆకారణంచేత స్వలాభం అపేక్షించు దిక్కుమాలిన అవస్థలో తనకుపెన్నిధియై, రక్తంపంచుకు పుట్టిన సోదరుడిలా భావించి, తనుచేసే పవిత్రారాధనలో పాల్గొ మనిసలహాయిచ్చి, చివరకి తన అభిమానం వెల్లువై పారేటట్టు 'తమ్ముడూ! నువ్వునాదగ్గిరే ఉండిపోవయ్యా' అని పలికిన శిల్పిని ఏవగించుకొనేవాడు.

అమాయకుడైన శిల్పికి పరాయి అబ్బాయి పట్ల సోదరభావం తగ్గలేదు. అతడు వెళిపోయాడు కదా అని, అతనికి అదృష్టం లేకపోయిందికదా అని విచారం, స్వతంత్రంగా అయినాగాని జీవితం గడపడానికి తగిన అవకాశం ఆతనికి కలిగిందికదా అని సంతోషం- ఈఅనుభవాలతో తల్లడిల్లిపోయేవాడు శిల్పి.

శిల్పికి గొప్పకీర్తి, కళా హృదయులకు గొప్ప ఆనందం ప్రసాదించే అవకాశం లభించింది. బుద్ధదేవుని విగ్రహం ఉత్తమంగా తయారు చేసినవారికి గొప్ప బహుమానం. ఒక కళాసంస్థవారు ఈపోటీ పెట్టేరు. శిల్పికి ధనం అక్కరలేదు. కళారాధన, లోకులకానందం కలిగించడం అతని ఆశయాలు. ఎందరో శిల్పులు

పోటీలో పాల్గొన్నారు. అధికారికూడా పాల్గొన్నాడు. శిల్పిప్రవీణత అధికారికి తెలుసు. ఆభయం అతన్ని పీడిస్తూనే ఉంది.

శిల్పికూడా నిర్మాణం ప్రారంభించేడు. చురుకుగా రచన సాగిపోతూన్నది. కళావాతావరణంలో శోభించే ఆయింటి చిన్నగదిలో శిల్పి అమృత హస్తాలనడుమ అహింసాకంకణం ధరించిన బుద్ధదేవుడు నించున్నాడు. నిద్రాహారాలు సైతం విసర్జించి, దీక్షలో నిమగ్నుడై పోయాడు శిల్పి. ప్రతిమా నిర్మాణం సుమారుగా ముగిసింది. నిలింపనేత్రాలతో ప్రపంచ గోళాన్ని సింహావలోకనంగావిస్తూ, స్ఫటిక సన్నిభమైన దేహంలోంచి దివ్యదీధితులీనుతూ నిశ్చలంగా నించున్న బుద్ధదేవుణ్ణి అనిమిషత్వం వహించి చూస్తూశిల్పి ఒక ఘడియ ఆలోచనలో మునిగిపోయాడు. నేత్రగోళాలలో శాంతి దీపికలను ప్రకాసింప జేస్తూన్న బుద్ధదేవునికి అవ్యక్తంగా ప్రణామం ఆచరించి 'దేవా ఈఫలితం ఎక్కడికోగదా?' అన్నాడుశిల్పి.

ఆ నిశ్చలత్వం ముగిసింది. పోటీ గడువు కొద్దిరోజులే ఉంది. అధికారి శిల్పివున్న ఊరు ఏదో పనిమీద వచ్చేడు. శిల్పితో అతనికి పరిచయంలేదు. శిల్పి గృహం ముందునుంచి పోతూండగా కిటికీలోంచి శిల్పి నిర్మించిన ప్రతిమ గోచరించింది. తన ఆశలు బ్రద్దలైపోయాయి. వెంటనే తిరిగి వెళ్లిపోయాడు. శిల్పికి బహుమానం రాక తప్పదనుకున్నాడు. శిల్పిని ఎందరు కీర్తిస్తారోగదా!! శిల్పి ఎంత అదృష్టవంతుడు! గుండెల్లో మంట పట్టుకుంది అధికారికి. గృహోన్ముఖుడయాడు.

అధికారిని దర్శించడానికొచ్చేడు పరాయి అబ్బాయి. అధికారి అతనితో భారంగా కొంత సంభాషణ జరిపేడు. చివరకి ఏదో విషయం చెబుతూ........తప్పకుండా రేపే నీకా ఉపకారం చేస్తానన్నాడు.

పరాయి అబ్బాయి మర్నాడే ఊరు బయల్దేరి శిల్పి యింటికి వెళ్లేడు. త్రోవలో కొంత అభిమానం కొనుక్కున్నాడు. గబగబ శిల్పి యింట్లోకి వెళ్లేడు. శిల్పి కనిపించలేదు. శిల్పితల్లి అతనితో అభిమానంగా కొంతసేపు మాట్లాడి 'బాబు ఎక్కడికో యిప్పుడే వెళ్లేడు' అన్నది.

'మళ్లీ వస్తా'నన్నాడు పరాయి అబ్బాయి. 'సరే' అని ఆవిడ ఏదో గృహకృత్యంలో నిమగ్నురాలైంది.

నిమ్మళంగా శిల్పి గదిలో ప్రవేశించాడు పరాయి అబ్బాయి. నిమీలితలోచనాలగుండా లోకానికి శాంతిని ప్రసాదిస్తూన్న బుద్ధదేవుడిని చూశాడు. పరాయి అబ్బాయి హృదయం ఒక పాషాణం! మనస్సు ఒక మట్టిదిమ్మ!!

అతని దేహంలోంచి విషం ఒక ప్రవాహంలా పరిగెట్టింది. '......చేతనానికి కొంత పెంపు!' ......చట్టని బుద్ధదేవుని శిరస్సు విరిగి క్రిందపడిపోయింది. పరాయి అబ్బాయికి దేహం యావత్తూ ఒక్కసారి కంపించింది. తడబడుతూ పారిపోవడానికి సిద్ధంగాఉన్న సమయంలో శిల్పి గదిలో ప్రవేశించాడు. ఆ భీభత్సదృశ్యాన్ని చూసి నిలువునా నీరైపోయి 'ద్రోహీ! ఎంతపనిచేశావు! నేను నీ కే అపకారంచేశానని నా హృదయాన్ని కొల్లగొట్టేవు?' అని తెగిపడిపోయిన శిరస్సు తీసి కళ్లకద్దుకొని 'దేవా! ఈ ఫలితం ఎక్కడికోగదా?' అంటూ బుద్ధదేవుని పాదాలమీద పడిపోయాడు శిల్పి. ద్రోహీ వెళ్లిపోయాడు. కాని శిల్పి పవిత్ర నేత్రద్వయం బుద్ధదేవుని పాదాలపైనే ఉండిపోయింది.

---